
# కామాక్షి కోరిక

విమలా రామం



కామాక్షికి చిన్నాళ్ల నుంచో తీరని కోరిక ఒకటుంది ...

లోకంలో కొందరికి కోరీ కోరక ముందే కొన్ని కోరికలు చటుక్కున తీరిపోతుంటాయి. మరికొందరికి ఏదో ఒకనాడు తీర్చుకొనే అవకాశాలు వస్తుంటాయి ... కాని, చాలా మందికి చాలా చాలా కోరికలు ఏ నాటికీ తీరనివిగానే మిగిలిపోతుంటాయి!

తీరని కోరికల్లో మూడు రకాలున్నాయి. తీర్చుకోటానికి అశక్యమని తెల్సుండి కూడా అత్యాశకు పోయి కోరుకొనేవి ఒక రకం — తీర్చుకోగలిగే శక్తి వున్నా దానికన్నా ముఖ్యమైనది మరొకటి వుందని తమంతట తాము వాయిదాలు వేసుకొనేవి రెండోరకం — తన కున్నంతలోనే తన చిన్న కోరిక తీర్చుకోవాలని తపన పడుతుంటే — అనుకోని ఆటంకాలు వచ్చి ఆ ముచ్చట తీరకుండా పోవటం మూడోరకం!

ఈ మూడవ తరగతికి చెందినది కామాక్షి కోరిక!

ఏలాగయినా తన కోరిక తీర్చుకోవాలన్న పట్టుదల మినహా ఆమె వూహలెప్పుడూ ఆ మూడతరగతి హద్దులు అధిగమించలేదు! అందరాని ఎత్తులకి ఎగరలేదు!

ఏదిగీ ఏదగని వయసులో బడిగోడల మీద చదివిన 'దురాశ దుఃఖమునకు చేటు' అన్న మాటలకి అర్థం అప్పుడు తెలుసుకోలేక పోయినా ... ఏదిగాక ఆ మాటలనే కాదు 'ఎంత చెట్టుకంత గాలి'అన్న మరో సామెతని కూడా బాగా అర్థం చేసుకుంది ఆ తర్వాత అలాంటి సూక్తులెన్నో జీవితంలో అన్వయించుకోవటమూ నేర్చుకుంది!

ఐదవ క్లాసుకి మించి చదవలేక పోయినందుకు ఆమె ఎవర్నీ నిందించలేదు. పల్లెటూర్లో పుట్టి పెరిగింది తను. అక్కడ అందరి లాంటిదే తను అని సరిపెట్టుకుంది. సిల్కు పరికిణీలు కట్టనందుకు కన్నవాళ్ళను సాధించి పోయలేదు ...ఈ మాత్రం బట్టలు కూడా లేని వాళ్లెంతో మందున్నారని ఎవరూ చెప్పకుండానే తెల్సుకుంది. గొప్పింటి కోడలు కాలేదని చిన్నబుచ్చుకోలేదు. గుమాస్తా భార్యనయితేనేం పట్నంలో కాపురమే ఒక గొప్పని మురిసిపోయింది. పెళ్లయి పదైనిమిదేళ్లయినా పట్టుచీరొకటి మగడు కొన్నాడు కాడని అసంతృప్తి పడలేదు ... నేతచీరయినా క్రొత్త చీర కొన్ననాడే పండగ చేసుకొని సంబరపడింది! ... ఇదీ అదీ అనియేమిటి? జీవితంలో అందిన దాంట్లోనే ఆనందం అందుకొని సంతృప్తి పడింది. భర్త అమర్చి పెట్టిన దాంట్లోనే అష్టైశ్వర్యాలు చవి చూసింది!

మరయితే కామాక్షికి తీరని కోరిక యేమిటి?

ఒకే ఒక బంగారు గాజుల జత చేయించుకోవాలని కాదు. నేతవే అయిన ఒక్కసారిగా పెట్టెనిండా చీరలు కొని పెట్టుకొని కన్నుల విందు చేసుకోవాలని కాదు మరి కాస్తంత పెద్ద పెద్ద గదులున్న అద్దెయింట్లోకి మారాలనీ కాదు ... ఇలాంటి సర్వసాధారణమైన సగటు కోరకలేవి కావు

కొందరికి తమకున్నది పుష్టి. తమకుంటేనే సంతుష్టి. కాని కామాక్షికిలాంటి ఒంటి మన్నెపు గుష్టాలు లేవు. సమిష్టిగా ఆత్మీయులతో కలిసి ఆనందంలో ఒక పాలు పంచుకోవటంలోనే ఆమెకు తృప్తి ఉంది

కొందరు తమకు చిన్ననాడు తీర్చుకోలేని ముచ్చట్లు తమ పిల్లలకి తీర్చిపెట్టి మురిసి పోతుంటారు కామాక్షికి ఆ కోరిక కూడా తీరనిది కాదు తను కట్టలేకపోయిన సిల్కు పరికిణీలు తన పిల్లలచేత కట్టిస్తోంది. కొడుకులతోపాటు కూతుళ్ళనీ హైస్కూల్లో చదివిస్తోంది.

ఇంకయితే కామాక్షికి తీరకుండా మిగిలి పోయిన ఆ కోరిక యేమిటి?

ఏవరయినా వింటే నవ్వుతారన్న జంకుతో ఆమె ఎవరికీ చెప్పలేదు చివరకి భర్త శంకరానికి కూడా చెప్పింది కాదు అతనికి ముందు తెలిసే అతను ఒప్పుకోడేమో అన్న అపనమ్మకం ఒకవైపు — ముందు చెప్పకుండా హఠాత్తుగా ఈ ముచ్చట తీర్చుకుని అతన్ని ఆశ్చర్యపర్చటంలోనే ఒక థ్రిల్ ఉంటుందని ఊహ మరొకవైపు ... ఆమె పెదవిని దాటి ఈ సంగతిని బయటకు రాకుండా చేసాయి.

ఆమె అలా భావించడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. కారణం ... ఆమె కోరిక ఆమె భర్తకి సంబంధించినది కావటమే!

ఆమెకు పెళ్ళికాక పూర్వమే ఈ కోరిక పుట్టింది! కమ్మని కలలు కనే కన్నెవయసది ...ఎదురింట్లో ఒక పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళికి వెళ్ళింది కామాక్షి పెళ్ళికొడుకుని చూసింది ఇదివరకు చాలా మంది పెళ్ళికొడుకుల్ని చూసింది కాని అలాంటి ముస్తాబులో ఎవర్నీ అంతవరకు చూసి యెరుగదు! అదే మొదటి సారేమో ... ఆ దృశ్యం ఆమె మనస్సుకి హత్తుకుపోయింది!

సూటు వేసుకోవటం వల్ల ఆ పెళ్లికొడుకు అందంగా కనిపించాడో, అతని వొంటి మీద వున్నందుకు ఆ సూటుకే అందం వచ్చిందో ఆమె వూహ కందలేదు!

తనకు రాబోయే పెళ్ళికొడుకు కూడా అంత చక్కగా వుండాలన్న కోరిక ఆమె కానాడే పుట్టింది! కాని, పెళ్ళిచూపులనాడే కాదు ... పెళ్ళి వేళ కూడా శంకరం అలాంటి బట్టలు వేసుకోలేదు! సంబరపడేవేళ ఆడంబరాలకు పరిమితి లేదనే కదా ఈ అలంకారాలు అని ఆమెకా చిన్న వయసులోనే అనిపించింది! ఇప్పుడు కాకపోతే మరింకెప్పుడు ... ఎందరో వేసుకోవటంలేదా ... అని కూడా అనిపించింది.

ఆ మాట పెళ యిన తర్వాత భర్తతో అననే అంది కూడా! ... 'మీ నాన్నగారు కొనిపెడితే వేసుకోనన్నానా?' అని మేలమాడాడు శంకరం. తన తండ్రి కొనలేక పోయాడనేగా ఈ యెత్తిపొడుపు ... అని ముఖం ముడుచుకుంది అప్పుడు. కాని, ఆ తర్వాత అత్తవారింట్లో పరిస్థితులు కూడా అంతంత మాత్రంగా ఉండటంచేతనే భర్త సూటు కొనుక్కోలేక పోయాడని అర్థం చేసుకుంది.

పెళ్ళికి ఆరేళ్ళ ముందు పుట్టి పెరిగిన కోరిక పెళ్ళినాడు తీరనందుకు ఎంతో నిరుత్సాహం కలిగినా ... అప్పుడే తీరాలని యేముంది? ఆ తర్వాత మాత్రం తీర్చుకోకూడదా అని అప్పటికి సరిపెట్టుకుంది.

తను కాపురం పెట్టుకున్నాక ఒక సూటు కుట్టించుకోమని భర్తతో ఒకటి రెండుసార్లు అంది. 'ఎందుకు? వచ్చే సంక్రాంతికి మా అత్తారింటికి వెడుతున్నాగా!' అని పరిహాసం చేసాడు శంకరం. కాని, ఆ తర్వాత ... ప్రతినెలా తన జీతం నుంచి కొంత డబ్బు తండ్రికి పంపటం అతనికి తప్పనిసరి కావటం చూసాక మళ్ళీ ఆ మాట అడగటానికి ఆమెకు నోరు రాలేదు!

సరే, ఏదో ఒకనాటికి పరిస్థితులు అనుకూలించినప్పుడు అతని చేత తప్పకుండా కొనిపిస్తుంది. ఫుల్ సూటులో తన భర్తను చూసుకొని తను మురిసి పోతుంది.

కామాక్షి అలాంటి కలలు కంటూండగానే నెలలు గడిచి సంవత్సరాలలోకి అడుగు పెట్టాయి. ఆమె కోరిక తీరే అవకాశం మాత్రం ఆమెకు కనుచూపు మేరలో కనిపించకుండా పోయింది!


## శుభవార్త



తలనొప్పి, కడుపునొప్పి, చర్మ వ్యాధులు, నరాల బలహీనత, ఫిట్సు, స్త్రీల ముట్టుకుట్టు నొప్పి, సుఖ వ్యాధులు, మూత్ర వ్యాధులు, చక్కెర వ్యాధి, మూలశంఖ, పిల్లలు లేకపోవుట, దాంపత్య సుఖ లోపం మొదలైన వ్యాధులను, మా వైద్యశాల ప్రధాన వైద్యులు డాక్టర్ **ఎస్. ఎస్. రావు** గారు నాడీ పరీక్షతో వైద్యము చేయుదురు.

పరీక్ష ఫీజు రు. **15/-** వ్యాధినిబట్టి చికిత్సకు చార్జి చేయుదురు. మందులు వారే ఇస్తారు.

NB : పేదల వైద్యము నెలకు రు **15/-**. రెండు మాసములమందు ఒకేసారి తీసుకొనవచ్చును.

క్యాంపుల వివరం : ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలలో

| | |
|---|---|
| హైదరాబాద్ : ప్రతినెల 1, 2, 3 తేదీలు : జయా లాడ్జి, కోటి | నెల్లూరు : 11 వ తేది : రాఘవ విహార్. |
| మహబూబ్‌నగర్ : 4 వ తేది : గణేష్ భవన్. | గుంటూరు : 12 వ తేది · ఉడిపి శ్రీకృష్ణ భవన్. (స్టేషన్ రోడ్) |
| కర్నూలు : 5 వ తేది : ఉడిపి హోటల్ (పెద్ద మార్కెట్‌వద్ద). | రాజమండ్రి : 13, 14 తేదీల శాంతి నివాస్. |
| గుంతకల్ : 6 వ తేది : శ్రీ లాడ్జి. | కాకినాడ : 15 వ తేది : ద్వారకా లాడ్జి |
| కడప : 7 వ తేది : ద్వారకా లాడ్జి. | వైజాగ్ : 16, 17 తేదీలు · బృందావన్ లాడ్జి (డాబా గార్డెన్స్) |
| తిరుపతి : 8 వ తేది : హోటల్ విక్రం, R.T.C. బస్సుస్టాండ్ ఎదుట. | విజయవాడ : 18 వ తేది : మోడరన్ కేఫ్, గాంధినగర్. |
| | ఖమ్మం : 19 వ తేది : మయూర్ కేఫ్ (శేష్‌మహల్ లాడ్జి) |
| మద్రాసు : 9, 10 : తేదీలు : కోమల విలాస్, నెం. 12, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీటు, (జి.టి.) హైకోర్టు ఎదురుగా. | వరంగల్ : 20 వ తేది : హోటల్ నటరాజ్. |
| | హైదరాబాద్ : 21వ తేది నుండి హెడ్డాఫీసు. |

సంప్రదించు కాలము : ఉ. 7 గంటలనుండి సా. 4 గంటల వరకు * నిరుద్యోగులకు, ఉద్యోగులకు శుభవార్త : పై సెంటర్సులో స్త్రీలు, పురుషులు ఏజంట్సుగా పనిచేసి, నెలకు రూ. 500 లు నుండి రూ. 1000 ల వరకు సంపాదించండి.

డాక్టరును సంప్రదించండి :

**ఎస్. ఎస్. రావూస్ క్లినిక్,** ప్లాట్ నెం. 471, జూబిలీహిల్సు రోడ్ నెం. 36, హైదరాబాద్—500034.

# కామాక్షి కోరిక

మొదట్లో రెండుమూడు సార్లు తన పుట్టింటి వాళ్ళిచ్చిన దయితేనే, ఇంటిఖర్చులు మిగిల్చి దాచిపెట్టిన దయితేనేం కొంతడబ్బు పోగుచేసింది. మరికొంత వేసి అతన్ని సూటు కుట్టించుకోమని అడుగుదామనుకుంది. అంతలోనే మరేదో అత్యవసరం వచ్చి అతనే ఆమెనడిగి డబ్బు పుచ్చుకున్నాడు. ఆ తర్వాత మరోసారి సరాసరి తన చెల్లెలు పెళ్ళికే వెళ్ళవల్సి వచ్చింది. ఇంకోసారి కాలేజీ ఫీజు కట్టాలని తిన్నగా ఆమెకే ఉత్తరం వ్రాసాడు మరిది. రెండుమూడు సార్లు హఠాత్తుగా వచ్చారు ఆడబడుచులు ... ఇలా రాసుకుంటూ పోతే భర్తకి సూటు కొనాలని ఆమె చేసిన ప్రయత్నాల పట్టిక కన్న ఆమెకు వచ్చిన ఆటంకాల జాబితా పెద్దదిగా తయారవుతుంది. అయితే, అడుగడుగునా అలా జరుగుతున్నందుకు ఎంత నిరుత్సాహం కలుగుతూ వచ్చిందో ... అలాంటప్పుడు ఆ డబ్బు గండాలు గడిపినందుకు అంత సంతృప్తిగానూ వుండేది ఈ రిలీఫ్ మూలంగానే కాబోలు ఆమె మనస్సులోని కోరిక బలహీనమవటం అంటూ ఎప్పుడూ జరగలేదు!

చాలామందికి కొన్ని కోరికలు తీరనయినా తీరతాయి. తీరకపోతే కాలక్రమేణా అవి అణగారిపోతాయి. కాని, కామాక్షి కోరిక ఆమె మనస్సులో బలపడుతూ వచ్చిందే కాని ఏ నాడూ ఆమె మనస్సుని వదలిపెట్టి పోలేదు: ఏదో ఒక నాటికి తీర్చుకు తీరాలనుకుంటూ వచ్చిందేకాని ఆ కోరిక మీద విరక్తి మాత్రం కలగలేదామెకు

చివరకి ఇలా అనుకోవటమే ఒక పరిపాటవటం ... ఎన్నటికీ ఇది తీరని దవటం జరిగేదేమో! కాని, రెండేళ్ళనాడు తన చెల్లెలు పెళ్ళికి వెళ్ళినప్పుడు తన మరిదిగారిని ఫుల్ సూటులో చూసాక ఈ వాయిదాలకిక ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకుంది!

ఊరి నుంచి తిరిగి రాగానే భర్త ముందు ఓ తీర్మానం తెచ్చింది. "...దేనికి, ఎందుకు అని అడగద్దు ప్రతినెలా నాకో పదిరూపాయిలు యివ్వండి:"

"నా జీతమంతా నీకే తెచ్చిస్తున్నానుగా? కావల్సినంత తీసుకో!" అని నవ్వాడు శంకరం.

"అహఁ! అలాక్కాదు. అచ్చంగా నాక్కావాల్సింది పది ఈ డబ్బీలో మీరే వెయ్యండి. ఎంత అవసరమొచ్చినాసరే ఆ డబ్బు ముట్టుకో కూడదు అలా కాకపోతే నాకిచ్చిన మాట మీరు తప్పినట్టే!"

ఏదో పరిహాసానికి భార్య అనలేదని గ్రహించాడతను. అతనూ నవ్వులాటకి సరే ననలేదు. చిత్తశుద్ధితో ఆమె కోరిక తీరే అవకాశం కల్పించాలని అంగీకరించాడు. అన్నట్టుగానే ప్రతినెలా పదిరూపాయలనోటు ఆమె డబ్బీలో వేయసాగాడు. ఆ తర్వాత చాలా సార్లు నెలాఖరు రోజుల్లో, డబ్బు అవసరం వచ్చేది. బయట ఎవరి దగ్గరో అప్పయినా చేసాడు కాని...ఆమె కిచ్చిన మాట మాత్రం తప్పలేదు ఆ డబ్బీ ముట్టుకో లేదు. చూస్తుండగా రెండు సంవత్సరాలు దాటిపోయాయి.

తన కోరిక తీర్చుకోవటానికి కామాక్షి పెట్టుకున్న గడువు దగ్గరపడింది. సూటుకి ఎంత బట్ట కావాలి, ఎంత ఖరీదవుతుంది ... వాకబు చేసుకుంటోంది అంత డబ్బు డబ్బీలోకి చేరిందా అని లెక్కలు వేసుకుంటోంది.

ఇటీవల జీతం వచ్చినరోజున పదిరూపాయిలు డబ్బీలో వేస్తూ 'ఇంకా ముహూర్తం పెట్టలేదా?' అని నవ్వుతూ అడుగుతున్నాడు శంకరం. ఇంతకాలం వస్తుంది వస్తుంది — అనేది, ఈ మధ్య వస్తోంది — దగ్గరికి వస్తోంది అనటం మొదలు పెట్టింది కామాక్షి.

ఓ రోజున "ఎందుకీ డబ్బు దాస్తున్నావో నాకు తెల్సితే!" అన్నాడతను అసలామె కోరిక ఏమిటో తెల్సుకోవాలని అతని ఉద్దేశ్యం కాని, అన్నేళ్ళు భద్రంగా గుండెలో దాచుకోగలిగిన సంగతి .. అందులో భర్తకి సంబంధించిన సంగతి చటుక్కున ఎలా చెపుతుంది? అతని వూహకి అందదని తెలిసాక మరింత గుట్టుగా దాచిపెట్టుకుంది ఆమె

ఆ వేళ జీతాలు తీసుకొనేరోజు ప్రొద్దున్న ఆఫీసుకు వెళ్ళేటప్పుడు అలవాటుగా "ఏమయినా కావాలా?" అని అడిగాడు శంకరం.

కామాక్షి రెప్ప వేయకుండా అతనివైపు చూసింది. "కావాలి వచ్చే పదోతారీఖున మీరు శలవు పెట్టాలి!"

అతను చిత్రంగా చూసాడు "ఏమిటి కథ? మన పెళ్ళిరోజు కాదుగా!"

"కాదు, నా పుట్టినరోజు!"


అతను నవ్వాడు "ఇన్నాళ్ళకి నీకు పుట్టినరోజు పండుగ చేసుకోవాలనిపించిందా?"

కామాక్షి కళ్ళు వింత కాంతితో తళ తళలాడాయి.

"ఆ వేళ నీకేం కొనిపెట్టను?" అని ప్రేమగా అడిగాడు

"నాక్కావల్సింది నేను కొనుక్కుంటాను ఇన్నాళ్ళూ మీరిచ్చిన డబ్బు చాలు దానికి"

(59 వ పేజీ చూడండి)



"ఇందుకేనా డబ్బు దాచింది ? దీనికి నెలల తరబడీ దాచాలా ! నీ కేది కావాలంటే అది ఎప్పుడో కొనిపెట్టేవాడ్నికదా !" అన్నాడు అతను ముఖం చిన్నబుచ్చుకొని.

"మీరు కొనిపెట్టరని కాదు ఎందుకో అలా దాచాలనిపించింది" అని నవ్వింది ఆమె.

"ఏమిటి కొనుక్కుందా మనుకుంటున్నావు ? " అని కుతూహలంగా అడిగాడు.

"ఉహుఁ ! కొన్నాక చూపిస్తాను !"

"అబ్బ, అంత రహస్యమా !"

"అవును మిమ్మల్ని ఒక్కసారిగా ఆశ్చర్యంలో ముంచుదామని !"

"నాకు తెల్సులేవోయ్ !"

"అలాగని నాచేత చెప్పిద్దామనా ? నేను చెప్పను. మీరు చెప్పుకోలేరు కాని ... వెళ్ళిరండి !"

అతను నవ్వుకుని ఆఫీసుకి వెళి పోయాడు. వెంటనే సూటు గుడ్డ కొని టైలరు కిస్తే కొని తన పుట్టినరోజు నాటికి అందదు. ఆ పూటే షాపుకి వెళ్ళి గుడ్డ కొనేద్దామనుకుంది ఆమె. కాని, సూటు తెచ్చి భర్త ముందు పెట్టి ఆశ్చర్యపరచటానికి వీలు లేదు. టైలరు కొలతలు తీసుకొనేటప్పుడయినా అతనికి సంగతి తెల్సిపోతుంది. అతని షర్టుని బట్టి కొలతలు తీసుకొని కోటు కుట్టిస్తే తీరా సరిపోతుందో లేదో ! ఇంత డబ్బు పెట్టి సూటు కుట్టిస్తే అది సరిగా లేకపోతే ప్రాణం ఉసూరుమంటుంది! ఈ పరిస్థితిలో భర్తతో చెప్పి యిద్దరూ షాపింగుకి వెళ్ళి వస్తేనే మంచిది ఇద్దరికీ నచ్చిన రంగులో తీసుకోవచ్చు. తన ముచ్చట తెలిసాక అతనిక కాదనడు కాదనలేడు ... ఇలా ఆలోచించి ఆ సాయంత్రం అతనింటికి రాగానే అతనితో కల్సి బజారుకి వెళ్ళాలని నిశ్చయించుకుంది ఆమె

అంతేకాదు. అతను వచ్చేవేళకు ముస్తాబయి సిద్ధంగావుంది. కాని, అతను మామూలు వేళకి రాలేదు ఇన్నాళ్ళకి అవసర మయినంత డబ్బు చేతిలో వుంది. తన ముచ్చట తీర్చుకునే క్షణం – ఏళ్ళ తరబడీ ఎదురు చూసిన క్షణం – ఎంతో దగ్గరకి వచ్చింది ... అని మురిసిపోతూంటే కొట్టు మూసేవేళయి పోతున్నా అతను యింటికి తిరిగిరాలేదు !

సూటు మాట దేవుడెరుగు ... జీతాలు వచ్చేరోజున ...ఇంతవరకు అతను రాకపోవట మేమిటి ? ... అని తెలిసిపోని భయాలతో

# కామాక్షి కోరిక

[ 10వ పేజీ తరువాయి]

ఆమెకు ప్రాణాలు గిల గిల లాడాయి కళ్ళు కాయలు కాసేలా చూస్తూ వీధి గుమ్మంలోనే నిలబడిపోయింది. "నాన్న యింకా రాలేదు. కొంచెం చూడండిరా !" అంది కంగారుగా. కొడుకు లిద్దరూ చూసివస్తామని వెళ్ళారు. వెళ్ళినవాళ్ళు వాళ్ళూ తిరిగిరాలేదు. ఎక్కడని వెతుకుతారు ! వాళ్ళనెందుకు పంపానా అని మరో దిగులు ప్రారంభ మయింది. ఆడపిల్లలిద్దర్నీ అటూయిటూ కూర్చోబెట్టుకొని గడపలోనే క్షణమో యుగంలా గడప సాగింది ఆమె.

ఏనిమిది గంటలు దాటాక కొడుకు లిద్దరితో తిరిగివచ్చాడు శంకరం !

"ఏమిటండీ యింత ఆలశ్యమయింది ?" అని ఉద్వేగ స్వరంతో అడిగింది కామాక్షి.

"బజార్లో తిరుగుతుంటే టయిము తెలియలేదు" అని నవ్వి చేతిలోని పేకెట్టు చూపించాడు తను.

ఆమె కళ్ళింత చేసి చూసింది. "ఏమిటిది ?"

"చెప్పుకోచూద్దాం?"అని మేలమాడాడు.

చిరునవ్వులు చిందిస్తూ,అతను ఎదుట నిలిచేసరికి గంటల తరబడీ పడిన ఆవేదనంతా ఒక్కసారిగా కరిగి నీరయింది. ఆమె కళ్ళలోకి నీళ్ళు చింది వచ్చాయి. "మీ కంతా వేళాకోళంగా వుంది. వేళకి వస్తారేమో – యిద్దరం కల్సి బజారుకి వెళ్ళచ్చని ఎదురు చూస్తూ కూర్చుంటే యిలాచేసారు."

"బజారుకి దేనికి ? నీ పుట్టినరోజు కానుక కొనుక్కుందామనేనా ?"

"దేనికోదానికి ! దేనికయినా కలిసి వెళ్ళకూడదా యేం ?" అంది బుంగమూతి పెడుతూ.

"ఎందుకు వెళ్ళకూడదు. 'నువ్వు కొనుక్కుందామనుకున్నదేదో నేనే కొని తెచ్చాను ! ఇక ఆశ్చర్యపడటం నీ వంతు' అని పేకెట్టు తెరిచి చూపించాడు.


ఆమె నిర్ఘాంతపోయింది.

"నువ్వేం కొనుక్కుందా మనుకుంటున్నావో నేను గ్రహించ లేననుకున్నావా ? ఇప్పుడేమంటావు ?..."అని నవ్వుతూ తెచ్చిన పట్టుచీర మడత విప్పి ఆమె భుజంమీద వేసాడు.

కామాక్షికి ప్రాణం ఉస్సురుమని పోయింది. ఉక్రోషంతో, కోపంతో ఆమె ముఖం కందగడ్డలాగయిపోయింది. తన భుజం మీద వున్న పట్టుచీర గుచ్చుకుంటున్నట్టు గబుక్కున తీసేసి పక్కనున్న బల్లమీద పడేసింది.

"ఎందుక్కొన్నారిది ?" అని పిచ్చిగా అరిచింది.

శంకరం తెల్లబోయాడు. పట్టుచీర కాక మరేం కొనుక్కుందామనుకుంది ? మూడు వందల్లో ఇదికాక మరి వచ్చేదేముంది ? బంగారం గురించి తలపెట్టే కాలం కాదిది,



## గమనిక

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జతపరచవలసి వుంటుంది. గేయాలు తిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది.

సం.




మీకు బేబి/బాబు కావాలా



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చినయోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణా నిపుణులు. ఉచిత వివరములకు:

శ్రీ నాగార్జున మూలిక కుటీరం,

| | |
|---|---|
| రామాలయం వీధి, తెనాలి—2. | 2వలైను, కేదారేశ్వరపేట, విజయవాడ-3. |

# కామాక్షి కోరిక

ఇంక ఏం కొనుక్కోవాలని ఆమె అనుకుందో అతనికి అంతుపట్టలేదు. "మరి...మరి ఏం కొనుక్కుందామనుకున్నావు ?" అన్నాడు తడబడుతూ.

ఏళ్ల తరబడి తను కన్న కలలు ... కొన్ని నెలలుగా తను చేసిన ప్రయత్నాలు ... అన్నీ ఒక్కపూటలో భగ్నమయిపోయాయి. అందులో దీనికోసం తానింత ఆరాట పడిందో అతనే చేజేతులా భగ్నంచేసాడు. ఉక్రోషంతో కామాక్షికి కళ్లనీళ్లు పొంగి వచ్చాయి. "ఛీ! నా ఆశలన్నీ పాడుచేసారు." అంటూ చరచరా వంటింట్లోకి వెళ్లిపోయింది.

శంకరం ఎంతో నిరుత్సాహపడిపోయాడు. ఆమె వెనుకనే వెళ్ళాడు. "వచ్చేది నీ పుట్టిన రోజు కదా .... నువ్వు యిదే కొనుక్కుందామనుకుని వుంటావని కొన్నాను. సరే, జరిగిందేదో జరిగిపోయింది. నీ డబ్బు నీ దగ్గరేవుంది కదా ! నీ క్కావల్సింది కొనుక్కో కామూ !"అన్నాడు అనునయంగా.

అతనెంత బతిమాలినా ఆమె మాట్లాడలేదు. ఆ రాత్రి యిద్దర్కీ నిద్ర పట్టనేలేదు ... పొద్దున్న పిల్లలు స్కూలుకి వెళ్లిపోయాక మళ్ళీ ఆ ప్రస్తావన తెచ్చాడు శంకరం. "... మన పెళ్ళయి యిన్నేళ్ళయినా నీకు పట్టుచీరొక్కటయినా కొనలేకపోయాను. ఇప్పుడెంతో సంబరపడి తెచ్చాను. ఇది కాదింకేదో కొనుక్కోవాలనుకుంటున్నావు. నేను కాదనటంలేదు. నీ యిష్టం వచ్చింది కొనుక్కో ! ..."

"ఎందుకు లెండి. దేనికయినా ప్రాప్తం ఉండాలి ! ..."

"నే నేదో తప్పు చేసినట్టు మాట్లాడుతున్నావు. నీ మనసులో ఉన్నదేమిటో పైకి చెప్పుకోందే ఎలా తెలుస్తుంది ?"

ఆమె చెప్పింది. ఆవేశంతో వచ్చిన ఆమె మాటలు అన్నేళ్ల ఆమె కోరికను బయటపెట్టాయి !

శంకరం నివ్వెరపోయి అన్నాడు. "నువ్వు ... నువ్వు చెప్తున్నది నిజమేనా !"

ఆమె ముఖం ఎర్రనై వుంది. "ఏం ? ఎందుకు అబద్ధం చెపుతున్నాననుకుంటున్నారు ?"

ఎంత ఆపుకుంటున్నా అతనికి నవ్వు వచ్చేసింది.

## కేన్సరు గుర్తింపుకి కొత్త పరికరం

శరీరంలోని అన్ని భాగాలను విడివిడిగా ఒక తెరపై చూపించగల నూతన పరికరాన్ని జపానులో రూపొందించారు. దీని సహాయంతో కేన్సరు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. టోక్యో ఆసుపత్రిలో దీనితో పరీక్షలను జరుపుతున్నారు ఈ పరీక్షల తర్వాత జపాను ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ ఈ కొత్త పరికరానికి ఆమోదం తెలుపగలదు. ఎక్స్‌రేలకంటే ఈ పరికరం సురక్షితమైంది. ఎక్స్‌రేల వలన ఏర్పడే అణుధార్మిక ప్రభావం దీనివలన ఏర్పడదు. ఈ పరికరాన్ని టోమో గ్రాఫిక్ స్కానర్ అని అంటారు. తోషిబా కార్పొరేషన్, టోక్యో విశ్వ విద్యాలయం వారు దీనిని సంయుక్తంగా రూపొందించారు.

"అదిగో ! అలా నవ్వుతారనే నే నింతవరకు మీకు చెప్పలేదు"

"ఏ ఆడదయినా తనకు చీరలు కావాలనో, నగలు కావాలనో కోరుకుంటుంది కాని..తన పుట్టినరోజుకి మొగుడికి సూటు కుట్టించాలని ఎక్కడా అనుకోదు. ఇలాంటి కోరికలు ఆడవాళ్ళకుంటాయని నే నెక్కడా వినలేదు" అని గలగల నవ్వాడతను.

"ఎవళ్ళ గొడవో ఎందుకు ? నా కిది కావాలనిపించింది. ఇది నా యిష్టం ! ఏం మీ కిష్టంలేదా ?"

"సూటుకేం నిక్షేపంలా వేసుకుంటాను. కాకుంటే షైరు కూడా వెడతాను."

"నా కలాంటి దురాశ లేనే లేదు. మీ కష్టార్జితంతో మీరో సూటు కుట్టించుకుంటె తప్పేముంది ?"

"చూడు కామూ ! ఏది తప్పు ... ఏది రైటు అన్నది కాదిక్కడ ప్రశ్న ! మనమేం చేసినా నలుగురు నోళ్లల్లోను పడకుండా వుండేలా చేయాలి !"

"ఇదేంచిత్రమండీ ! మీరు సూటు వేసుకుంటే ఎవరేమంటారు ?"

"మా ఆఫీసులో నా తోటి వాళ్లెవరూ సూటు వేసుకురారు..."

"...వాళ్లు వేసుకోకపోతే పోనివ్వండి. మీరు వేసుకోటానికేం? మీ యిష్టం మీది..."

"నన్ను చెప్పనీ! నేను వేసుకు వెళ్లాననుకో ... సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. నాకేదో లక్షలు లాటరీలో తగిలాయన్నట్టు చూస్తారు. హఠాత్తుగా ఆస్తులేవయినా కలిసొచ్చాయా అని అడిగేస్తారు..."

కామాక్షికి చిరాకెత్తింది. "అవుననండి. అక్కడితో నోళ్లు మూసుకుంటారు."

"అహా! వాళ్లూరుకున్నా మా ఆఫీసరు వూరుకోడుగా! తనలాగే తమ క్రింద పని చేసేవాళ్లు కూడ ఖరీదయిన బట్టలు వేసుకోవటం ఆఫీసర్లకి యిష్టముండదు. ఆఫీసు పనిలో కాస్త యిటో అటో అయిందనుకో ... అక్కడ్నుంచి తన అక్కసు నా సూటుమీదే చూపిస్తాడు. ఇంకీ వీధిలో వాళ్లంతా నాకేమన్నా ప్రమోషను వచ్చిందా అని అడుగుతారు అమ్మలక్కలంతా నీ మీదకి దండయాత్రకి వస్తారు. సరే, సూటుతో సరిపోతుందా? దానికి తోడు బూటు కావాలి, టై కావాలి. డ్రైక్లీనింగు ఖర్చు, బూటుపాలిష్ ఖర్చు, రోజూ గెడ్డం చేసుకోవాలంటే బ్లేడు ఖర్చు..."

"మీకంతా వేళాకోళం!"

"కాదు. నిజం! ఒక్క సూటుంటే ఇన్ని అవస్థలు పడాలి. అదే లేదనుకో ఏ బాదరబందీ లేదు. నే నెలా వున్నానో ఎవడికీ అక్కర్లేదు"

కామాక్షి ముఖం చిన్నబోయింది. "అంటే, ఎవరికిష్టం వచ్చిన బట్టలు వాళ్లు వేసుకునే హక్కు కూడా లేదా ఈ లోకంలో?" అంది నిరుత్సాహంగా.

అతను గాఢంగా నిట్టూర్చాడు. "వాస్తవం చెప్పాలంటే లేదనే చెప్పాలి. పోలీసు వాడికి కాకీ యూనిఫారములా, జైల్లో ఖైదీలకి గళ్ల బట్టల్లా మనలాంటి మధ్య తరగతి వాళ్లక్కూడా కొన్ని రకాల బట్టలు కేటాయించబడినట్టే లెక్క! మన జీవితాలెలా వుంటాయో మనం వేసుకొనే బట్టలే చెపుతాయి. ఒకవేళ సూటు వేసుకొని వెళ్లానే అనుకో ఎవరికితోచినట్టు వాళ్లు విపరీతార్థాలు తీస్తారు."

ఉద్వేగంతో ఆమెకు మాటలు రాలేదు.

"...ఇదే సూటు రేపు మన వాసుకి కుట్టించామనుకో! ఎవరూ ఏమీ అనరు. అనుకోరు. చదువుకుంటున్నవాడు ... ఏదో యింటర్వ్యూకి వెడుతున్నాడనుకుంటారు... అంతేకాని, నా లాంటి వాడు వేసుకుంటే అంతా నవ్వుతారు."

"అదేంకాదు. మీ రనవసరంగా భయపడుతున్నారు. మనవాళ్లు చాలా మంది వేసుకుంటున్నారు."

"ఎవరు వేసుకోవటం చూసావు?"

"ఆ మధ్య మా చెల్లెలు మొగుడు వేసుకోలేదు? ... అతను పెళ్ళప్పుడు వేసుకున్నాడని చెప్పకండి. ఎవరికెప్పుడు వీలయితే అప్పుడు వేసుకుంటారు అందులో ఎవరో ఏదో అనుకోవటానికి ఏముందో నా కర్థం కావటంలేదు"

"పిచ్చిదానా! నువ్వనుకున్నట్టే 'నా కిష్టమైంది కనుక వేసుకుంటాను. నీకేం మధ్య,' అని అడిగినవాళ్ల మాటలు త్రోసి పారెయ్యచ్చునేను. కాని, ముందు ముందు ఆడపిల్లల పెళ్ళిళ్లు పెట్టుకొని, మగపిల్లల కాలేజీ చదువులు పెట్టుకొని ఈ దూబరా ఖర్చు లెందుకురా ... అని ఎవరోకాదు మా అమ్మే అంటుంది నన్ను! ఆవిడకేమని జవాబు చెప్పను?"

కామాక్షికి దుఃఖంతో గొంతు పూడిపోయింది.

"నిన్న నీకు పట్టుచీర కొన్నానా? పెళ్ళాంకి పట్టుచీర కొన్నాడని మా అమ్మే కాదు ... యిరుగూ ... పొరుగూ అంతా సంతోషిస్తారు! ఇన్నాళ్లకో మంచి పని చేసావని అంతా హర్షిస్తారు. నువ్వేచెప్పు.... నలుగురి చేతా శభాషనిపించుకునే పని చెయ్యనా — వేలెత్తి చూపించుకునే పని చెయ్యనా?...."

భర్త చెపుతున్న మాటలు కామాక్షికి వినిపించటంలేదు ... ఇంతేనా? చిన్ననాటి నుంచి కలలు కన్న కోరిక తీర్చుకునే అవకాశమేలేదా? ఇంత చిన్న కోరికను కూడా నలుగురూ ఆమోదించవల్సిందేనా? ఎవరి జీవితాలు వాళ్లు అనుభవించే స్వేచ్ఛ నిజంగా ఈ లోకంలో లేనేలేదా? .... ఇలాంటి ప్రశ్నలెన్నో ఆమె చుట్టూ గిరగిర తిరుగుతున్నాయి. ఇన్నాళ్లుగా మనస్సులో పెంచుకున్న ఆశల్ని త్రుంచి వేస్తున్నాయి.

"....అంతగా సూటులో నన్ను చూడాలని కోరిగ్గావుంటే చెప్పు ఎవరిదేనా వేసుకుని నీ వొక్కదానికి చూపిస్తాను.' అని ఆమెను నవ్వించాలని చూసాడు శంకరం.

ఆమె బుగ్గల మీదకి జల జల జారి వచ్చింది కన్నీరు "లేదు. మీరు ఎరువు బట్టలు వేసుకోవాలని నాకు లేదు. ఏదో దొంగ పని చేస్తున్నట్టు తప్పు చేస్తున్నట్టు రహస్యంగా మీరాపని చేయాలని నాకు లేదు." అంది చేతులతో ముఖం కప్పుకుంటూ.

ఆమెను ఎలా సముదాయించాలో అతని కర్థంకాలేదు

తీరని కోరికల్లో నాల్గవరకానికి చెందినవి కూడా ఉంటాయని ఆమె కిప్పుడిప్పుడే అర్థమవుతోంది! ☆

